# ఉదరనిమిత్తం

మధ్యాహ్నం నుండి నరసింహులు నిప్పులు తొక్కినట్లున్నాడు. భార్య మీద అతనికి పట్టరాని కోపం వచ్చింది. ఎంత బతకలేక హోటల్ పెట్టుకుంటే మాత్రం పరాయి మగవాళ్ళతో సిగ్గులేకుండా వ్యవహరిస్తుందా? మధ్యాహ్నం భోజనానికి వచ్చినప్పుడు ఆ రామిరెడ్డి సరసాలాడడమూ, యీ మనిషి ముసి ముసి నవ్వులు నవ్వడమూ తాను వసారాలో నుండి చూస్తూనే వున్నాడు. పట్ట పగలు మగడు చూస్తాడేమో అన్న జ్ఞానం కూడా లేకుండా ........ ఛీ! యీ మనిషిని యేం చేసినా పాపం వుండదు. అంత కోపం వున్నా, పెండ్లాన్ని చీవాట్లు పెట్టడానికి అతనికి పగలంతా తగిన సమయం చిక్కనే లేదు. దాంతో అతని మనస్సు మరీ చిరచిర లాడింది.

ఉన్న పదెకరాలూ చేసుకుంటూ వుండమని తమ్ముణ్నీ, తల్లినీ పల్లెటూర్లో వదలిపెట్టి, నరసింహులు టౌన్ చేరినాడు. టౌన్‌లో భోజనం హోటలు పెట్టి ఇంకా నెలన్నర కాలేదు. మొదట కొద్ది రోజులు హోటల్ జరుగుతుందో లేదో అని అనుమానంగానే వుండినా, తరువాత వెంట వెంటనే వ్యాపారం అభివృద్ధిఐ, పని మనిషిని కూడా పెట్టుకోవలసి వచ్చింది. నెల తిరిగేటప్పటికి లాభమేమీ లేకపోయినా భవిష్యత్తును గురించి భయం తీరింది. ఇక సుఖంగా బతకవచ్చునని తృప్తిపడుతూ వుండిన నరసింహులుకు భార్య ప్రవర్తన భయంకరమైన సమస్యగా యెదురైంది.

టౌన్ చేరి హోటల్ పెడదామని సలహా యిచ్చింది కూడా అతని భార్యే. మొదటిసారి తల్లితో యీ మాట అన్నప్పుడు "యెవర్రా నీకీ

పాడుబుద్ధులు నేర్పుతున్నది?" అంటూ ఆమె యెగిరిపడింది. ఆ సలహా చెప్పింది తన కోడలే అని తెలుసుకొని "టౌన్ పిల్లను చేసుకోవద్దని మొత్తుకున్నా నా మాట వినకపోతివి. యిక నీకూ నాకూ రుణాలు తీరిపోయినాయి" అంటూ ఆమె కండ్ల నీళ్ళు పెట్టుకుంది.

"టౌన్ పిల్ల యిప్పుడు నిన్నేమన్నదమ్మా? బతుకు దెరువుకు వుపాయం చెప్పడం కూడా తప్పేనంటావా? యీ పదెకరాల చౌటి పర్రలో రెక్కలు విరుచుకున్నా మన కడుపులు నిండడం లేదు. పైగా యీ మూడేండ్లలోనూ వెయ్యి రూపాయలు అప్పు చేయవలసి వచ్చింది," అన్నాడు అతను.

"ఈ సారి పండకపోతే ముందుకైనా పండకపోతుందా? వానలు రాకపోతే యెవరి భూములైతే పండుతాయి?" అని తల్లి యెదురు వాదం ఆరంభించి, "భూములు పండలేదని రైతులందరూ టౌన్లు చేరి హోటళ్ళు పెడుతున్నారా?" అన్నది. అంతటితో ఆగకుండా "యివన్నీ దాని బుద్ధులే. దాని కాఫీలూ, షోకులూ యిక్కడ సాగలేదని యీ యెత్తు యెత్తింది" అంటూ కోడలి మీద నిందలు వేసింది.

తన భార్య టౌను మనిషి కాదు గాని, స్కూలు మాస్టరు కూతురు కావడం వల్ల కొన్ని టౌను అలవాట్లు వెంట తెచ్చుకుంది. "మన పని పాటలకు ఆ పిల్ల పనికిరాదు" అని తల్లి చెప్పినా తాను వినకుండా, అందంగా నాజూగ్గా వుంటుందని మోజుపడి చేసుకున్నాడు. హోటల్ పెట్టుకుందామని ఆమె సలహా యిచ్చినప్పుడు కూడా ఆమె లోకజ్ఞానానికి తాను మురిసిపోయినాడు.

యివన్నీ నరసింహులు మనసులో మెదలినాయి. తల్లి మాటలన్నీ కోడలిమీద అత్తకుండే సహజమైన అసూయ అనే తాను అప్పుడు అనుకు

న్నాడు. కానీ యిప్పుడు ఆలోచిస్తే భార్యను గురించి తానే పొరపాటు పడినట్లుంది. భార్యమీద కోపానికి తోడు, నమ్మి మోసపోతిననే కించతో అతని హృదయం ఆ సాయంత్రమంతా కుతకుతలాడింది.

రాత్రి హోటల్ మూసిన తర్వాత, పని మనిషిని యింటికి పంపించిన వెంటనే తలుపులు మూసి అతను భార్యతో తీక్షణంగా అన్నాడు: "నీవు చేసే పని నాకేమీ బాగలేదు."

ఆమెకు అర్థం గాక సహజ ధోరణిలో "యేం పని ?" అన్నది.

పగలంతా అణచి పట్టుకున్న కోపం అతను ఒక్కసారి వెళ్ళగక్కినాడు. "పైగా నంగనాచి మాటలు నేర్చినావు. మధ్యాహ్నం నీవా రామిరెడ్డితో సరసాలాడడం నేను చూల్లేదనుకున్నావా ?"

ఒక క్షణం పాటు కామేశ్వరి నివ్వెరపోయింది. తరువాత తేరుకొని, చిరునవ్వు నవ్వుతూ అడిగింది: "నేను సరసాలాడడం మీరు చూసినారా ?"

ఆమె చిరునవ్వు చూసి అతను నిప్పులు కక్కినాడు. "చూసే అడుగుతున్నాను."

"ఆ రామిరెడ్డితో నే నసలు ఒక మాట కూడా మాట్లాడలేదే ?"

"మాట్లాడకపోతే సరా ? అతని మాటలకు నీవు ముసిముసి నవ్వులు నవ్వలేదూ ? బుద్ధున్న మనిషివైతే అతని వెకిలి చేష్టలకు నీవు ప్రోత్సాహమిస్తావా ?"

అతని ఆవేశం చూసి కామేశ్వరికి భయమైంది. రామిరెడ్డి వెకిలి చేష్టలు చేసింది నిజమే కానీ, తాను ముసి ముసి నవ్వులు నవ్వలేదు, ప్రోత్సాహమూ యివ్వలేదు. యీ పిచ్చి మనిషికి యిట్లా అనుమానాలు కలిగి హోటల్ మూసిపేస్తే యీ బ్రతుకుదెరువూ పోతుంది. ఇప్పుడు కష్టపడినా కష్టానికి తగిన ఫలితమైనా దొరుకుతున్నది. మళ్ళీ పల్లెటూరు

చేరితే, పుణ్యం పురుషార్థం లేని పొలం పనికి యిద్దరి జీవితాలూ అర్పించి నికృష్టమైన బ్రతుకులు బ్రతకవలసిందే. ఆమె నెమ్మదిగా అన్నది: "నేనో మాట చెప్తాను — శాంతంగా వింటారా?"

ఆమె కంఠంలోని గాంభీర్యం చూసి అతని కోపం తేటపటా యించింది. మంచంమీద కూర్చుంటూ "చెప్పు" అన్నాడు.

మంచం దగ్గరనే నేలమీద కూర్చొని కామేశ్వరి శాంతంగా ఆరంభించింది, "పల్లెటూర్లో బతకలేకనే యీ టౌనుకొచ్చి హోటల్ పెట్టుకున్నాము. నౌకర్లనూ, వంట మనుషులనూ పెట్టుకునే యోగ్యత మనకు లేదు. ఇద్దరమూ కష్టపడితే తప్ప పొట్ట గడవదు. మనం యెంత కష్టపడినా పదిమందీ ఆదరించకపోతే హోటల్ జరగదు.... ఏమంటారు?"

ఆమె వాదం విని అతనికి వొళ్ళు మండింది. "పదిమందీ ఆదరించాలంటే తప్పుడు పనులు కూడా చెయ్యాలంటావా?"

ఆమె యింకా శాంతంగా సమాధానం చెప్పింది. "మాటి మాటికీ తప్పుడు పనులని యెందుకంటారు? మధ్యాహ్నం నేనేదైనా తప్పుపని చేసి వుంటే మీరు అప్పుడే యెందుకు దండించకూడదు?"

"నలుగురిలోనూ నగుబాట్లు కావాలని వుందా నీకు?"

భర్త ముఖంలోకి చూసి కామేశ్వరి జాలిగా చిరునవ్వు నవ్వింది. "పోనీ మన వూర్లోనే ఆ రామిరెడ్డి అట్లా ప్రవర్తించి వుంటే యేం చేసి వుండే వాళ్ళు?"

ఉద్ధృతంగా జవాబు చెప్పినాడు నరసింహులు: "అప్పుడే పండ్లు రాలగొట్టి పంపించేవాణ్ణి."

"మరి యీ రోజు ఆ పని యెందుకు చేయలేదు?"

ఒక క్షణంపాటు అతను జవాబు చెప్పలేక ఉక్కిరిబిక్కిరైనాడు. మరుక్షణంలో రెట్టించిన ఆవేశంతో అన్నాడు : "ఐతే యేమిటి నీవనేది ? నీ బుద్ధి గడ్డి తినింది గాక, ఆ రామిరెడ్డితో కొట్లాడలేదని నా మీదనే నెపం వేస్తున్నావా? నీవు మర్యాదగా నడుచుకుంటే యితరులను అనవలసిన పని యేముంది ? హోటలన్న తరువాత రకరకాల మనుషులు వస్తుంటారు. అందరితో కొట్లాటలు పెట్టుకుంటే యిక హోటల్ మూసుకోవాల్సిందే."

కామేశ్వరి నిబ్బరంగా చెప్పింది : "నేననేదీ ఆ మాటే. హోటలన్న తరువాత రకరకాల మనుషులూ వస్తుంటారు. వాళ్ళతో కొట్లాటలు పెట్టుకుంటే హోటల్ మూసుకోవాల్సిందే."

నరసింహులుకు నోట మాట రాలేదు.

(ఫిబ్రవరి 1960)